సాక్షి నల్లగొండ

శనివారం, 9, మార్చి, 2024



ఇద్దరు చైన్ స్నాచర్ల అరెస్ట్
ఒంటరి మహిళల మెడలో బంగారు ఆభరణాలు లాక్కెళ్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో



భక్తుల కోరికలు తీర్చే తల్లి..
భక్తులు కోరిన కోరికలు తీర్చే తల్లి సాగర్ మాత అని నల్లగొండ విశ్రాంత పీఠాధిపతి డాక్టర్ గోవింద్ జోజి అన్నారు. - 8లో



నది మధ్యలో శివనామస్మరణ
సాగర్ జలాశయం మధ్య సింహపురి కొండపై ఏలేశ్వరస్వామి జాతరకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. - 10లో

న్యూస్‌రీల్

ఉచిత శిక్షణకు రేపు ప్రవేశ పరీక్ష

నల్లగొండ: వివిధ పోటీ పరీక్షల ప్రిపరేషన్ కోసం ఐదు నెలల ఉచిత ఫౌండేషన్ శిక్షణకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 10న ఉదయం 11నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎంట్రెన్స్ టెస్ట్ ఉంటుందని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఇవ్వనున్న ఈ శిక్షణకు దరఖాస్తు చేసుకున్నవారు స్టడీ సర్కిల్ వెబ్‌సైట్ tsstudycircle.co.in ద్వారా హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు బ్లాక్ బాల్ పాయింట్ పెన్ను మాత్రమే తెచ్చుకోవాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని దేవరకొండ రోడ్డులో గల శ్రీచైతన్య హై స్కూల్‌లో పరీక్ష ఉంటుందని, 11 గంటలలోపే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు సెల్ : 8465035932, 9603167257 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రైతాంగాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలి



ఎండిన పొలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

నల్లగొండ టూటౌన్: బోర్లలో నీరు తగ్గిపోయి వరి చేలు ఎండిపోయిన రైతాంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వమే ఆదుకోవాలని బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. నలగొండ పట్టణ సమీపంలోని మర్రిగూడ గ్రామంలో సాగునీరు లేక ఎండిన వరి పొలాలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఎకరానికి రూ.25 వేల చొప్పున నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రచార కార్యదర్శి బీపంగి జగ్జీవన్ రామ్, వేమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి



మహిళలను సన్మానిస్తున్న శాస్త్రవేత్త

గరిడేపల్లి: మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని కేవీకే శాస్త్రవేత్త సుగంధి అన్నారు. శుక్రవారం గరిడేపల్లి మండల పరిధిలోని గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు పురుషులతో సమానంగా పనిచేసుకుంటూ స్వయం ఉపాధి పొందుతున్నారని తెలిపారు. పెరటి తోటలు, కోళ్లు, పుట్టగొడుగులు, పట్టుపురుగుల పెంపకం, కుట్టు మిషన్‌పై కేవీకేలో శిక్షణ తీసుకొని కుటుంబ ఆదాయాన్ని రెట్టింపు చేసుకోవాలన్నారు. అనంతరం ఉత్తమ మహిళా రైతులు, ఉపాధ్యాయులను సన్మానించారు.

● ఓం నమఃశివాయ





మహా శివరాత్రి సందర్భంగా శుక్రవారం నల్లగొండ పరిధిలోని పానగల్ ఛాయాసోమేశ్వరాలయంలో స్వామివారి కల్యాణానికి పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు, ప్రత్యేక అలంకరణలో శివలింగం



పానగల్‌లోని ఛాయాసోమేశ్వరాలయంలో అభిషేకం చేస్తున్న ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ గంట్ల అనంతరెడ్డి, భక్తులు

కాంగ్రెస్ నుంచి రఘువీర్

నల్లగొండ ఎంపీ అభ్యర్థిని ప్రకటించిన అధిష్టానం

- పటేల్ రమేష్‌రెడ్డికి హామీ ఇచ్చినా.. కుందూరు రఘువీర్‌రెడ్డికే టికెట్
- జానారెడ్డి పెద్ద కుమారుడికి కూడా రాజకీయ బాటలు
- భువనగిరి సీటుపై ఇంకా తేల్చని కాంగ్రెస్
- ఇక్కడ బీసీలకు టికెట్ ఇచ్చిన బీజేపీ
- 'హస్తం' పార్టీలోనూ అదే అంశంపై తర్జనభర్జన



పేరు: కుందూరు రఘువీర్ రెడ్డి
తండ్రి: కుందూరు జానారెడ్డి
వయస్సు: 44 (02-01-1980)
విద్యార్హత: డిగ్రీ,
వృత్తి: వ్యాపారం
భార్య పేరు: లక్ష్మి
పిల్లలు: ఈశాన్వి, గౌతమ్‌రెడ్డి
పార్టీ పదవులు : 2009లో రాష్ట్ర యువజన కాంగ్రెస్ సభ్యుడు
2014, 2018లో పీసీసీ సభ్యుడు
2021లో పీసీసీ జనరల్ సెక్రటరీ

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థిని ఖరారు చేసింది. కుందూరు రఘువీర్‌రెడ్డి పేరును ప్రకటించింది. కాంగ్రెస్ అధిష్టానం శుక్రవారం ప్రకటించిన ఎంపీ అభ్యర్థుల తొలి జాబితాలో నల్లగొండ అభ్యర్థి పేరును కూడా వెల్లడించింది. భువనగిరి ఎంపీ సీటు విషయాన్ని పెండింగ్‌లో పెట్టింది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత పార్లమెంట్ అభ్యర్థిత్వాల విషయంలో నల్లగొండ నుంచి మాజీ మంత్రి జానారెడ్డి తనయుడు కుందూరు రఘువీర్‌రెడ్డి పేరు తెరపైకి వచ్చింది. జానారెడ్డి ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ నుంచి తప్పుకొని తన చిన్న కుమారుడు జయవీర్‌రెడ్డికి నాగార్జునసాగర్ టికెట్ ఇప్పించుకున్నారు. జయవీర్ భారీ మెజార్టీతో విజయం సాధించారు. ఆ తరువాత జానారెడ్డి లేదా రఘువీర్‌రెడ్డిలలో ఎవరో ఒకరు పార్లమెంట్ ఎన్నికల్లో పోటీచేస్తారని ప్రచారం సాగింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో సూర్యాపేట టికెట్ కోసం మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, పటేల్ రమేష్‌రెడ్డి పోటీపడ్డారు. అధిష్టానం మాత్రం దామోదర్‌రెడ్డికి టికెట్ ఇచ్చింది. దీంతో రమేష్‌రెడ్డి అలకబూనగా ఎంపీ టికెట్ ఇస్తామని మల్లు రవితోపాటు ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ కూడా అప్పుడు హామీ ఇచ్చారు. అయితే, పటేల్ రమేష్‌రెడ్డికి టికెట్ ఇస్తారని భావించినా ఆ తరువాత జానారెడ్డి, ఆయన తనయుడు రఘువీర్‌రెడ్డి పేర్లే తెరపైకి వచ్చాయి. వీరితో పాటు పలువురు ఎంపీ టికెట్ ఆశించినప్పటికీ సీఎం రేవంత్‌రెడ్డికి జానారెడ్డి, అయన కుమారులతో మంచి సంబంధాలు ఉండటంతో అధిష్టానం రఘువీర్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసింది. జానారెడ్డి తాను అనుకున్నట్లుగా పెద్ద కుమారుడికి నల్లగొండ ఎంపీ టికెట్‌ను ఇప్పించుకోవడం ద్వారా తన ఇరువురు కుమారులకు రాజకీయంగా బాటలు వేసినట్లయింది.

పెండింగ్‌లో భువనగిరి అభ్యర్థి పేరు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నల్లగొండ, భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గాలున్నాయి. నల్లగొండ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా కుందూరు రఘువీర్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసినా భువనగిరి ఎంపీ అభ్యర్థి ఎవరనేది తేల్చలేదు. దానిని ప్రస్తుతానికి పెండింగ్‌లో పెట్టింది. భువనగిరి నుంచి ఎంపీగా పోటీ చేసేందుకు చాలా మంది ఉత్సాహం చూపుతున్నారు. కోమటిరెడ్డి సోదరులు తమ కుటుంబ సభ్యుల కోసం ప్రయత్నాలు చేశారు. కోమటిరెడ్డి సూర్యపవన్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి లక్ష్మి పోటీచేస్తారన్న చర్చ సాగింది. ఆ తరువాత కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తన కుటుంబ సభ్యులు ఎవరు పోటీ చేయడం లేదని ప్రకటించారు. దీంతో టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పేరు తెరపైకి వచ్చింది. మరోవైపు టీపీసీసీ నాయకుడు పున్నా కైలాష్ నేత, చెవిటి వెంకన్న, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి కుమారుడు సర్వోత్తమ్‌రెడ్డి కూడా టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే, బీజేపీ అక్కడ బీసీ అభ్యర్థి, గౌడ సామాజికవర్గానికి చెందిన డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయడంతో అటు కాంగ్రెస్, అటు బీఆర్ఎస్ ఆలోచనల్లో పడ్డాయి. అక్కడ బీసీ అభ్యర్థిని పోటీలో నిలుపాలా.. ఓసీ అభ్యర్థిని నిలపాలా అన్న ఆలోచనల్లో కాంగ్రెస్ పార్టీ పడింది. ఇక్కడ ఎవరికి టికెట్ ఇస్తారన్నది నాలుగైదు రోజుల్లో తేలనుంది.

హక్కుల పరిరక్షణకు రాజీలేని పోరు



మిర్యాలగూడ టౌన్ : పోస్టర్ విడుదల చేస్తున్న పౌర హక్కుల సంఘం ప్రతినిధులు

మిర్యాలగూడ టౌన్: రాజ్యాంగం కల్పించిన పౌర హక్కుల పరిరక్షణ కోసం ఐదు దశాబ్దాలుగా రాజీలేకుండా పోరాడుతున్నామని పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రతినిధి పి.సుబ్బారావు అన్నారు. సంఘం 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 9, 10వ తేదీల్లో హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే సభల పోస్టర్‌ను శుక్రవారం ఆయన మిర్యాలగూడలోని గ్రంథాలయంలో ఆవిష్కరించి మాట్లాడారు. వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలతో పాటు మహిళలు, దళితులపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలను ఖండిస్తున్నామని పేర్కొన్నారు. మేధావులు, యువకులు, ఉద్యోగ, ఉపాధ్యాయులు భారీ సంఖ్యలో ఈ సభలకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ప్రతినిధులు బి.రామయ్య, కె.శ్రీనివాస్, కిరణ్మయి, జ్వాల వెంకటేశ్వర్లు, అజయ్ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం

మఠంపల్లి : మండలంలోని మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని శుక్రవారం అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిత్యహోమం పూర్తిగావించి శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలంకరణతో వధూవరులుగా ముస్తాబు చేసి ఎదుర్కోళ్ల మహోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాభంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగళ్యధారణ, తలంబ్రాలతో కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు.

జిల్లాను సస్యశ్యామలం చేస్తాం

- సమగ్రాభివృద్ధికి పాటుపడతా
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- పలుచోట్ల రోడ్డు పనులకు శంకుస్థాపన



గుర్రంపోడులో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి

నల్లగొండ రూరల్: ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం పనులు పూర్తి చేసి ప్రతి ఎకరాకు సాగునీరందించి జిల్లాను సస్యశ్యామలం చేస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్లగొండ మండలం గుండ్లపల్లి గ్రామంలో మునుగోడు రోడ్డులోని గుండ్లపల్లి ఎక్స్ రోడ్డు నుంచి నర్సింగ్‌భట్ల-కురంపల్లి వరకు రూ.50కోట్ల నిధులతో చేపట్టిన డబుల్ రోడ్డు విస్తరణ పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం, బి.వెల్లెంల ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలని మాజీ సీఎం కేసీఆర్‌కు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదన్నారు. కేసీఆర్ పని అయిపోయిందని ఎద్దేవా చేశారు. నల్లగొండ జిల్లాను ఒక కన్నుగా, తెలంగాణ రాష్ట్రంలోని మిగతా జిల్లాలను రెండో కన్నుగా భావించి సమగ్రాభివృద్ధికి పాటుపడతానన్నారు. రూ.700 కోట్లతో ఏఎమ్మార్పీ మెయిన్ కెనాల్ తోపాటు, డి.37 కెనాల్ లైనింగ్ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. గొర్రెల పథకం స్కాంలో ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేలను జైలుకు పంపితే చంచల్‌గూడ జైలు కూడా సరిపోన్నట్లు ఉందన్నారు. గుండ్లపల్లికి సబ్ స్టేషన్ మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, ఎంపీపీ సుమన్, ఎంపీటీసీ ఇరిగి సహదేవ్, మాజీ సర్పంచ్ పనస శంకర్‌గౌడ్, రాజేంద్రప్రసాద్, తాజు, పాండు, ఉప్పునూతల వెంకన్నయాదవ్, యాదగిరి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మూడు నెలల్లో రోడ్డు పనులు పూర్తిచేస్తాం

గుర్రంపోడు: నల్లగొండ-కొండమల్లేపల్లి ప్రధాన రహదారి పనులకు మూడు నెలల్లో పూర్తి చేయిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గుర్రంపోడులో నల్లగొండ-కొండమల్లేపల్లి ప్రధాన రహదారి పనులకు నాగార్జునాసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రూ.పది కోట్లలో గుర్రంపోడు మండల పరిధిలో లచ్చుగూడెం స్టేజి నుంచి పాల్వాయి వరకు 26 కిలోమీటర్ల రోడ్డును పీరియాడికల్ రెన్యువల్ పనులు చేపడతామన్నారు. మాజీమంత్రి జానారెడ్డి హయాంలో నిర్మించిన రోడ్లు తప్ప ఇక్కడే మరో కొత్త రోడ్డు నిర్మించలేదన్నారు. ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి తన దృష్టికి తేవడంతో నల్లగొండ నుంచి ముషంపల్లి రోడ్డును కన్నెకల్ మీదుగా తిప్పర్తి వరకు పొడిగించామన్నారు. మండలకేంద్రంలో రహదారి బంగ్లాను నూతనంగా నిర్మించేందుకు రూ.కోటి నిధులు మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గాలి రవికుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తగుళ్ల సర్వయ్య, ఎంపీటీసీలు కుప్ప రాములు, కంచర్ల వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు సూదిని జగదీశ్వర్‌రెడ్డి, జాలచినసత్తయ్య యాదవ్, కుప్ప అమరేందర్, షేక్ సయ్యద్‌మియా, చనమల్ల జగదీశ్వర్‌రెడ్డి, కమతం జగదీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండ రూరల్ : గుండ్లపల్లిలో రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి వెంకట్‌రెడ్డి

సమాజంలో మహిళలందరినీ గౌరవిద్దాం



కేక్ కట్ చేస్తున్న పీఆర్‌టీయూ టీఎస్ ప్రతినిధులు

నల్లగొండ: నేటి సమాజంలో పురుషులకు దీటుగా అన్నిరంగాల్లో రాణిస్తున్న మహిళలందరినీ గౌరవించడం మన బాధ్యత అని పీఆర్‌టీయూ టీఎస్ నేత, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం నల్లగొండలోని పీఆర్‌టీయూ భవన్‌లో ఆ సంఘం ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం పలువురు మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా పూల రవీందర్ మాట్లాడుతూ మహిళా దినోత్సవం సందర్భంగా 200 మంది మహిళా ఉపాధ్యాయులను సన్మానించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షురాలు డి.కళావతి, నారాయణ, కవిత, జిల్లా అధ్యక్షుడు డీవీఎస్.ఫణికుమార్, కాలం నారాయణరెడ్డి, ఓరుగంటి శ్రీనివాసులు, డీటీఓ సంపూర్ణ, డాక్టర్ కీర్తిరెడ్డి, ఎంఈఓ అరుంధతి, మహిళా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు అరుణశ్రీ, దేవపాల, హిమజ, వెంకటమ్మ, విజయలక్ష్మి, వనం పద్మ, సువర్ణ, రూపారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబవుతున్న యాదాద్రి

- 11 నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు
- ముమ్మరంగా ఏర్పాట్లు
- తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రణాళిక



ప్రధానాలయ ముఖ మండపంలో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు

యాదగిరిగుట్ట: బ్రహ్మోత్సవాలకు యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ముస్తాబవుతోంది. ఈ నెల 11న విశ్వక్సేనుడికి ఆరాధన, స్వస్తి పుణ్యాహవాచనంతో పాంచరాత్ర ఆగమ శాస్త్రం ప్రకారం బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 21న శతఘటాభిషేకం, డోలోత్సవంతో సమాప్తి కానున్నాయి. ఇందుకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ప్రధానాలయ ముఖ మండపం, ఆంజనేయస్వామి ఆలయం, ఉప ఆలయాలకు విద్యుత్ దీపాలంకరణ చేస్తున్నారు. మూడవ ఘాట్ రోడ్డు మార్గంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేకంగా విద్యుత్ లైట్లు వేస్తున్నారు. పని చేయని లైట్లకు మరమ్మతులు చేస్తున్నారు. ఇక కొండ కింద పాతగుట్ట చౌరస్తా, బస్టాండ్ సమీపంలో భారీ స్వాగత తోరణాలు ఏర్పాటు చేస్తున్నారు. కొండపైన రథశాల ఎదుట కళ్యాణ వేదిక ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు.

భక్తులకు ఆహ్లాదం పంచేలా..

బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఆహ్లాదం పంచే విధంగా పచ్చదనాన్ని పెంపొందించేందుకు పనిలో ఆలయ సిబ్బంది చర్యలు చేపట్టారు. కొండపై, ఆలయ పరిసరాల్లో ఉన్న మొక్కలు, చెట్లకు ఉదయం, సాయంత్రం వేళ్లలో నీటిని పడుతున్నారు. కొండపైకి మిషన్ భగీరథతో పాటు ఇతర ప్రాంతాల నుంచివచ్చే నీళ్లుసరిగ్గా సరఫరా కావడం లేదు. దీంతో కొండ కింద లక్ష్మీపుష్కరిణి బావి నుంచి మోటార్ల ద్వారా ట్యాంకర్లను నింపి కొండపైకి తీసుకువచ్చి చెట్లకు పడుతున్నారు.

భక్తుల రద్దీకి అనుగుణంగా నీటి సౌకర్యం

బ్రహ్మోత్సవాల దృష్ట్యా భక్తుల రద్దీకి అనుగుణంగా కొండపైకి తాగునీటి సరఫరా పెంచాలని అధికారులు నిర్ణయించారు. 17న ఎదుర్కోలు ఉత్సవం, 18న శ్రీస్వామి అమ్మవార్ల తిరు కల్యాణ మహోత్సవం, 19వ తేదీన దివ్య విమాన రథోత్సవం ఉన్న నేపథ్యంలో ఎక్కువ మొత్తంలో నీటి సరఫరా చేసేందుకు ప్రణాళిక రూపొందించారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం

బ్రహ్మోత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించారు. అవసరమైతే యాదగిరిగుట్ట మున్సిపాలిటీ నుంచి అదనంగా పారిశుద్ధ్య సిబ్బందిని నియమించనున్నట్లు సమాచారం.

అన్ని మండల కేంద్రాల నుంచి బస్సులు

బ్రహ్మోత్సవాలకు వివిధ జిల్లాలతో పాటు యాదాద్రి భువనగిరిలోని అన్ని మండల కేంద్రాల నుంచి ఆర్టీసీ బస్సులు నడపనున్నారు. స్వామివారి కళ్యాణం రోజు రాత్రి భక్తులు తిరిగి వెళ్లేందుకు వీలుగా బస్సులు నడిపేందుకు ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. హైదరాబాద్ జంట నగరాల నుంచి భక్తులు ఎక్కువ వచ్చే అవకాశం ఉన్నందున ఉప్పల్, చెంగిచెర్ల డిపోల సహకారంతో అదనపు బస్సులు ఏర్పాటు చేయనున్నారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఇప్పటికే కలెక్టర్ హనుమంతు కే.జెండగే విద్యుత్, రోడ్లు, రవాణా, వాటర్‌గ్రిడ్, ట్రాఫిక్, సివిల్ పోలీసులు, ఆర్టీసీ తదితర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాచకొండ సీపీ తరుణ్‌జోషి, డీసీపీ రాజేశ్‌చంద్ర ఆలయాన్ని సందర్శించి భద్రతా చర్యలపై సమీక్షించారు.

లక్ష ఎకరాలు తగ్గిన వరి

గణనీయంగా తగ్గనున్న ధాన్యం దిగుబడి

- ప్రస్తుత సీజన్‌లో 4.20లక్షల ఎకరాల్లోనే సాగు
- ఇప్పటికే సగానికిపైగా ఎండిన పైర్లు
- తీవ్ర ఆందోళనలో అన్నదాతలు



హాలియా మండలం వెంకటాద్రిపాలెంలో పొట్టదశలో ఉన్న వరిచేను

	ప్రస్తుత సీజన్	గత యాసంగి
విస్తీర్ణం (ఎకరాల్లో..)	4,20,000	5,56,802
దిగుబడి (మెట్రిక్ టన్నుల్లో)	10.8(అంచనా)	13.36

నల్లగొండ అగ్రికల్చర్: ప్రస్తుత యాసంగి సీజన్‌లో జిల్లాలో వరిసాగు గణనీయంగా తగ్గింది. గత యాసంగిలో జిల్లా వ్యాప్తంగా 5.56లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగును చేయగా ప్రస్తుత యాసంగి సీజన్‌లో 4.20 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. దీంతో గతం కంటే ఈసారి 1,36,802 ఎకరాల్లో వరిసాగు తగ్గినట్టు అయ్యింది. వర్షాభావ పరిస్థితులకు తోడు నాగార్జునసాగర్, ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టుల నుంచి సాగునీటి విడుదల లేకపోవడంతో బోర్లు, వ్యవసాయ బావులపై ఆధారపడిన రైతులు మాత్రమే వరిసాగు చేపట్టారు. అయితే జిల్లా వ్యాప్తంగా భూగర్భ జలాలు పడిపోయి బోర్లు, వ్యవసాయ బావులు వట్టిపోయాయి. దీంతో రైతులు సాగునీటి ఇబ్బందులు తప్పవని ముందస్తుగానే పసిగట్టి వరిసాగును తగ్గించినట్టు తెలుస్తోంది.

దిగుబడిపైనా ప్రభావం

జిల్లా వ్యాప్తంగా కరువు పరిస్థితులు నెలకొనడంతో భూగర్భ జలాలు తగ్గి బోర్లు, వ్యవసాయ బావుల ద్వారా సక్రమంగా నీరందక ప్రస్తుత సీజన్‌లో సాగు చేసిన వరిచేలు చాలా వరకు ఎండిపోతుండడంతో దిగుబడిపై ప్రభావం పడనుంది. గత యాసంగి సీజన్‌లో 13,36,324 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి రాగా ప్రస్తుతం జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు వేసిన అంచనాల ప్రకారం 10,8000 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే దిగుబడి వచ్చే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. అంటే గత యాసంగి సీజన్ కంటే ప్రస్తుత సీజన్‌లో 3,28,324 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి తగ్గనుంది. ప్రస్తుతం ఎండల తీవ్రత పెరుగుతుండడంతో భూగర్భ జలాలు భారీగా తగ్గే అవకాశం ఉంది. దీంతో పొట్టదశలో ఉన్న వేలాది ఎకరాల వరిచేలు ఎండిపోతుండడంతో రైతులు తమ పశువులను మేపుతున్నారు. ఫలితంగా ఈ సీజన్‌లో వ్యయసాయ అధికారుల అంచనాలకు మించి వరిధాన్యం దిగుబడి మరింత తగ్గే అవకాశం ఉంది.

వరిపొలం ఎండిపోతుంది



వరినాటు వేసినప్పుడు బోరు బాగానే పోసింది. ప్రస్తుతం ఆగిఆగి పోస్తుంది. దీంతో ఐదెకరాల్లో వరి సాగుచేస్తే రెండు ఎకరాలు ఎండిపోయింది. ఉన్న మూడెకరాలు కూడా చేతికి వస్తుందో రాదోనని భయంగా ఉంది. పెట్టుబడులు కూడా వచ్చేటట్టు కనబడడం లేదు. ప్రభుత్వమే ఆదుకోవాలి.

– వెంకటాద్రి రమేష్, వెంకటాద్రిపాలెం, హాలియా మండలం

చాలా ప్రాంతాల్లో బోర్లు పోయడం లేదు



జిల్లాలోని అనేక ప్రాంతాల్లో బోర్లు సక్రమంగా పోయడం లేదు. ప్రస్తుతం భూగర్భజలాలు అడుగంటి బోర్లు, బావుల్లో నీరు తగ్గిపోయింది. చాలా ప్రాంతాల్లో వరిచేలు పొట్టదశలోనే ఉన్నాయి. మరో నెలరోజుల పాటు బోర్లు పోస్తే తప్ప వరిపైర్లు చేతికొచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

– పాల్వాయి శ్రవణ్‌కుమార్, డీఏఓ, నల్లగొండ

క్లుప్తంగా

సాంబారు గిన్నెలో పడి బాలుడికి గాయాలు

నడిగూడెం : ప్రమాదవశాత్తు సాంబారు గిన్నెలో పడి బాలుడికి గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం నడిగూడెం మండలం వల్లాపురం రెవెన్యూ పరిధిలోని శ్రీ బాలకోటేశ్వర స్వామి ఆలయం వద్ద జరిగింది. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం పెరికసింగారం గ్రామానికి చెందిన అడపాల నవీన్ తన ఎనిమిదేళ్ల కొడుకు మనోహర్‌ను తీసుకొని నడిగూడెం మండలం వల్లాపురం రెవెన్యూ పరిధిలోని శ్రీ బాలకోటేశ్వరస్వామి ఆలయం వద్ద జరుగుతున్న జాతరకు వచ్చారు. మధ్యాహ్నం అన్నదానం సమయంలో బాలుడు మనోహర్ సాంబారు గిన్నెపై ఓ వైపు కూర్చొని పుట్నాలు తింటున్నాడు. ఈ క్రమంలో జారి సాంబారులో పడడంతో గాయాలపాలయ్యాడు. స్థానికులు అతడిని 108 వాహనంలో ఖమ్మం ఆస్పత్రికితరలించారు.

గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతి

చౌటుప్పల్ : గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతిచెందాడు. ఈ ఘటన చౌటుప్పల్ మండల పరిధిలోని ఎల్లగిరి గ్రామ శివారులో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం....ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని రాక్‌బరేలీ జిల్లా ఈశ్వర్‌దాస్‌పూర్ గ్రామానికి చెందిన హరికేష్‌సింగ్(52) లారీడ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ప్రస్తుతం పీయూష్ లాజిస్టిక్ కంపెనీకి చెందిన లారీకి డ్రైవర్‌గా ఉన్నాడు. ఈ క్రమంలో లారీలో లోడ్ వేసుకొని ఒడిషాకు బయలుదేరాడు. శుక్రవారం తెల్లవారుజామున 4గంటల ప్రాంతంలో ఎల్లగిరి గ్రామ శివారుకు చేరుకున్నాడు. చాలా నీరసం, అలసటగా అనిపించడంతో వాహనాన్ని జాతీయ రహదారి పక్కన నిలిపాడు. ఇతర వాహనదారులు 108 వాహనానికి సమాచారం అందించగా అక్కడికి చేరుకున్న సిబ్బంది వెంటనే అతన్ని చౌటుప్పల్‌లోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


మణికంఠ మృతదేహం

కొండమల్లేపల్లి : రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన కొండమల్లేపల్లి మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుర్రంపోడు మండలం తేనేపల్లి గ్రామానికి చెందిన రాసిక మణికంఠ(16) గురువారం బైక్‌పై నాంపల్లి మండలంలోని ముష్టిపల్లి గ్రామానికి వచ్చాడు. తిరిగి కొండమల్లేపల్లి మీదుగా స్వగ్రామానికి వెళ్తుండగా కొత్తపల్లి గ్రామం సమీపంలో బైక్ అదుపు తప్పి మిషన్ భగీరథ ట్యాంక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన మణికంఠను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. మృతుడి తండ్రి లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు.

మోత్కూరులో పట్టపగలే చోరీ

మోత్కూరు : పట్టపగలే దుండగులు తెగబడ్డారు. తాళం వేసిన ఇంట్లోకి చొరబడి చోరీకి పాల్పడ్డారు. మోత్కూరులో పట్టణంలోని అంగడిబజార్‌కు చెందిన భట్టు లింగయ్య, అండాలు దంపతులు శుక్రవారం మేకలు తోలుకొని అడవికి వెళ్లారు. ఎవరూ లేని సమయం చూసి దొంగలు ఇంటికి వేసిన తాళం విరగ్గొట్టి లోనికి ప్రవేశించారు. ఇంట్లో కందులు ఉన్న ఓ కుండలో దాచిన 120 తులాల వెండి, రూ.20వేల నగదును అపహరించుకుపోయారు. సాయంత్రం వారు తిరిగి రాగా చోరీ విషయం బయటపడింది. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఇద్దరు చైన్ స్నాచర్ల అరెస్ట్

- రూ.2.20 లక్షల విలువైన బంగారం స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ రాజశేఖర్‌రాజు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖరరాజు

మిర్యాలగూడ అర్బన్: ఒంటరి మహిళలను టార్గెట్‌గా చేసుకుని వారి మెడలో ఉన్న బంగారు ఆభరణాలు లాక్కెళ్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు వివరాలు వెల్లడించారు. తిప్పర్తి మండలం గంగన్నపాలెం గ్రామానికి చెందిన ఈద సతీష్, పెద్దవూర మండలం పెద్దగూడం గ్రామానికి చెందిన జింకల నాగరాజు వరసకు బావ బావమరుదులు అవుతారు. వీరద్దరు కారు డ్రైవింగ్ చేస్తూ జీవితం గడిపే వారు. చెడు వ్యసనాలకు బానిసలుగా మారి కష్టపడకుండా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో ఒంటరి మహిళలను టార్గెట్ చేస్తూ వారి మెడలో ఉన్న బంగారు గొలుసులను లాక్కొని పరారవుతుండే వారు. గత నెల 3వ తేదీన పెద్దమండలం పెద్దగూడేనికి చెందిన కూన్‌రెడ్డి పిచ్చమ్మ పొలానికి వెళుతున్న క్రమంలో మోటార్ సైకిల్‌పై వచ్చి ఆమె మెడలో ఉన్న మూడున్నర తులాల బంగారు పుస్తెల తాడు లాక్కొని పారిపోయారు. బాధితురాలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు.

వాహనాల తనిఖీలో..

పెద్దవూర వై జంక్షన్ వద్ద శుక్రవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వెళ్తూ అనుమానాస్పదంగా కనిపించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా వారు చేసిన చైన్ స్నాచింగ్‌ల గురించి తెలిసిందని చెప్పారు. వీరు గత సంవత్సరం జనవరి 10న నకిరేకల్ శివారులో పశువులు కాసే వృద్ధురాలి మెడలో రూ.40 వేల విలువ చేసే బంగారు గొలుసు, అదే ఏడాది ఫిబ్రవరి 25న వెలమగూడం గ్రామంలో రూ.35వేల విలువ చేసే బంగారు గొలుసు, మార్చి 3వ తేదీన పెద్దగూడం గ్రామ శివారులో ఒంటరిగా ఉన్న మహిళ మెడలో పుస్తెల తాడు అపహరించుకుని పోయారని విచారణలో తేలిందన్నారు. వారి వద్ద నుంచి రూ. 2.20 లక్షల విలువ చేసే 4 తులాల 6 గ్రాముల బంగారు ఆభరణాలు, బైక్, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వీరు నల్లగొండ, సూర్యాపేటలోనూ చైన్ స్నాచింగ్‌కు పాల్పడినట్లు అనుమానాలున్నాయని, వాటిపై కూడా పూర్తి విచారణ చేస్తామని తెలిపారు. ఈ కేసును ఛేదించిన నాగార్జునసాగర్ సీఐ బీసన్న, ఎస్ఐ. సంపత్, హెడ్‌కానిస్టేబుల్ జి.ఆనందయోగి, కానిస్టేబుళ్లు కిషన్, రాజు, కోటయ్య, రవి, నాగరాజు, జావిద్, హోంగార్డులు మధు, రాంబాబు, మట్టయ్య, వెంటరామిరెడ్డిలను ప్రత్యేకంగా అభినందించారు.

పుట్టిన రోజునే మృత్యుఒడికి..

- బైక్ అదుపుతప్పి కింద పడడంతో గాయాలు
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి


ప్రభాస్ మృతదేహం

మిర్యాలగూడ టౌన్ : పుట్టిన రోజునే ఓ బాలుడు మృతిచెందాడు. ఈ విషాకర ఘటన గురువారం రాత్రి మిర్యాలగూడ మండలంలోని మైసమ్మకుంటతండాలో చోటుచేసుకుంది. సీఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం... మిర్యాలగూడ మండలంలోని మైసమ్మకుంట తండాకు చెందిన తేజావత్ రమేష్‌కు ఇద్దరు కుమారులు. పెద్దవాడు లక్ష్మణ్, చిన్నవాడు ప్రభాస్‌లు ఉన్నారు. గురువారం అన్నదమ్ములు ఇద్దరు స్కూటీపై తండా సమీపంలో గల వాటర్ ట్యాంకు తండాకు నీటి కోసం క్యాన్ తీసుకొని వెళ్లారు. క్యాన్‌లో నీటిని తీసుకొని తిరిగి ఇంటికి వస్తుండగా స్కూటీ అదుపుతప్పి కిందపడడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. వారిని మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ప్రభాస్ (12) గురువారం రాత్రి మృతి చెందగా లక్ష్మణ్ చికిత్స పొందుతున్నాడు. అయితే ప్రభాస్‌ది పుట్టిన రోజు కావడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ప్రభాస్ తండ్రి రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ ఉమాపతిరావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వీరబాబు తెలిపారు.

కరువు మండలాలను ప్రకటించాలి


మాట్లాడుతున్న నాగార్జున్‌రెడ్డి

దురాజ్‌పల్లి (సూర్యాపేట): రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కరువు మండలాలను ప్రకటించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కార్యదర్శి వర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులతో జిల్లాలోని లక్షలాది ఎకరాల్లో వరి పంటలు పూర్తిగా ఎండిపోయాయని అన్నారు. ఎస్సారెస్పీ కాలువ పరిధిలోని పొలాలు పొట్ట దశలో ఉన్నాయని, ఎస్సారెస్పీ కాలువ ద్వారా నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎండిపోయిన పంటలకు ప్రభుత్వం ఎకరాకు రూ.20వేల చొప్పున నష్ట పరిహారం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు యాదగిరిరావు, గోపి, సైదులు, యాక లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

- సూర్యాపేట కలెక్టర్ వెంకట్రావ్


మొక్కలకు నీరు పోస్తున్న కలెక్టర్ వెంకట్రావ్

దురాజ్‌పల్లి (సూర్యాపేట): మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని కలెక్టర్ వెంకట్రావ్ అన్నారు. వాటరింగ్ డేను పురస్కరించుకొని శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కృష్ణానగర్‌లో మొక్కలకు నీరు పోశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి సమీపిస్తున్నందున మొక్కలకు ప్రతిరోజూ నీటిని అందించి సంరక్షించాలన్నారు.

మహిళా సదస్సుకు ఏర్పాట్లు చేయాలి

సికింద్రాబాద్‌లోని పెరేడ్ గ్రౌండ్‌లో ఈ నెల 12న నిర్వహించనున్న మహిళా సదస్సుకు జిల్లా నుంచి అధిక సంఖ్యలో మహిళలను తరలించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వెంకట్రావ్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ, మెప్మా అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా నుంచి 49 బస్సుల్లో సుమారు 2500 మంది మహిళలను తరలించారని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్డీఓ మధుసూదన రాజు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దేశంలో కాంగ్రెస్ గెలవడం అవసరం

- సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ వర్రె వెంకటేశ్వర్లు

కోదాడ : దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం చారిత్రాత్మక అవసరమని, ప్రజలు ఈ విషయంలో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని సమాచార హక్కు మాజీ కమిషనర్ వర్రె వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం పట్టణంలో సమాచార హక్కు వికాస సమితి ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టం–2005పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం చాలా ఉందన్నారు. ఈ చట్టం పూర్తిస్థాయిలో అమలైతే అవినీతి లేని పాలన అందుతుందని, అప్పుడే అభివృద్ధి సాధ్యమతుందన్నారు. ప్రభుత్వాలు చేస్తున్న చట్టాలు, పాలన వ్యవహారాలు సామాన్యులు తెలుసుకొనే విధంగా సమాచారహక్కు చట్టాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ దేశంలో మరోసారి అధికారంలోకి రావాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో జరుగుతున్న అవినీతిని సమాచార హక్కు చట్టాన్ని ఉపయోగించి వెలికి తీయాలని కోరారు. కార్యకర్తలు చట్ట పరిధిలో మాత్రమే పనిచేయాలని, దీనిని అడ్డుపెట్టుకొని అధికారులను వేధిస్తున్నారనే ఆరోపణలు రాకుండా వ్యవహరించాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పనితీరు బాగుందని, అవినీతి రహిత సమాజం దిశగా కాంగ్రెస్ పాలన సాగాలని ఆయన ఆకాంక్షించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. సమాచార హక్కు వికాస సమితి అధ్యక్షుడు కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన సదస్సులో ప్రధాన కార్యదర్శి చేకూరి శివ, ఉపాధ్యక్షుడు విక్టర్‌బాబు, ఏసుపాదం, ఉపేందర్, గంధం పాండు, మాతంగి శ్రీను పాల్గొన్నారు.

బోరునీటిని వాడుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలి

అనంతగిరి : ప్రభుత్వ బోరు నీటిని వ్యవసాయ అవసరాలకు వాడుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బాణోతు బాబునాయక్ అన్నారు. మండలంలోని పాతగోల్‌తండా గ్రామపంచాయతీ పరిధిలోని మీట్యాతండాలో ప్రభుత్వ బోరు బావిని శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. కొన్ని సంవత్సరాల క్రితం వాయిలసింగారం క్రాస్‌రోడ్డు వద్ద ప్రయాణికుల తాగునీటి అవసరాలకు ప్రభుత్వం చేతిపంపును ఏర్పాటు చేసింది. ఆ బోరుబావికి ఉన్న చేతిపంపును తీసి గ్రామ పల్లెప్రకృతి వనానికి నీటిని అందిస్తున్నారు. ఇదే క్రమంలో 15రోజుల నుంచి పల్లెప్రకృతి వనానికి వెళ్తున్న పైప్‌లైన్ నుంచి మరో పైప్‌లైన్ ఏర్పాటు చేసి పక్కనే ఉన్న వ్యవసాయ బావిలోకి ఓ రైతు నీటిని వాడుకుంటున్నాడని, గ్రామాల్లో తాగునీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే కార్యదర్శి అక్రమంగా బావి నింపుకుంటున్న వారికి సహకరిస్తున్నారని ఆరోపించారు. కార్యదర్శిపై సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఇదిలా ఉండగా నెల క్రితం బోరు నుంచి పక్కకు పెట్టిన చేతిపంపును గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు అధికారులు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పై విషయాలపై ఇన్‌చార్జ్ ఎంపీడీఓను వివరణ కోరగా.. ఇప్పటి వరకు ఆ విషయాలు తమ దృష్టికి రాలేదన్నారు.

కంఠమహేశ్వర స్వామికి జలాభిషేకం


జలబిందెలతో వెళ్తున్న గౌడ పెద్దలు

భానుపురి : పట్టణంలో కంఠ మహేశ్వర స్వామి సురమాంబ దేవి 6వ కల్యాణ మహోత్సవం సందర్భంగా పట్టణ కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం జలాభిషేకం నిర్వహించారు. స్వామి అమ్మవార్లకు అభిషేకం, పంచామృత స్నానం, పుష్పాదివాసం, ఫలాదివాసం, వస్త్ర అలంకరణ కార్యక్రమాలు జరిపారు. ఈ వేడుకల్లో పట్టణ కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు రాపర్తి పెద్ద శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షుడు ఏలుగురి గోవింద్, ప్రధాన కార్యదర్శి గుణగంటి కృష్ణ, కోశాధికారి కెక్కిరేణి సత్యనారాయణ, డైరెక్టర్లు బొమ్మగాని మారయ్య, పాడిశెట్టి వెంకన్న, అయితగాని జనార్దన్, ఎల్గురి లక్ష్మమ్మ, కప్పల శశిరేఖ గౌడ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అంధుడికి సూర్యాపేట ఎస్పీ ఆర్థికసాయం


నగదు అందజేస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట క్రైం : నకిరేకల్ పట్టణానికి చెందిన ఎల్లయ్య అనే అంధుడు శుక్రవారం సూర్యాపేట జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రాహుల్‌హెగ్డేను కలిశారు. ఈ సందర్భంగా తన విద్యాభ్యాసం, కుటుంబ నేపథ్యం, ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే పట్టుదల గురించి ఎస్పీకి వివరించాడు. అతని ఆర్థిక పరిస్థితి, పట్టుదలను గమనించిన ఎస్పీ తక్షణం కొంత నగదును ఆర్థిక సహాయంగా అందజేశారు. అంధుడు ఎల్లయ్య మాట్లాడుతూ రాబోయే పోటీ పరీక్షల ఖర్చులకు సద్వినియోగం చేసుకుంటానని తెలిపారు. చిన్నతనంలోనే చూపు కోల్పోయిన ఎల్లయ్య చదువుపై ఉన్న ఇష్టంతో లిపి ద్వారా పోస్టు గ్రాడ్యుయేట్, బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో పట్టభద్రుడు కావడం విశేషం.

టిప్పర్ ఢీకొని తండ్రీకుమారుడు మృతి


ప్రమాదానికి కారణమైన టిప్పర్


మృతదేహాల వద్ద విలపిస్తున్న బంధువులు

- టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణం
- జాజిరెడ్డిగూడెం మండలం బొల్లంపల్లిలో విషాదం


జానయ్య (ఫైల్)


విఘ్నేష్ (ఫైల్)

అర్వపల్లి: టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యానికి తండ్రీకుమారులు బలయ్యారు. ఈ విషాదకర ఘటన జాజిరెడ్డిగూడెం మండలం బొల్లంపల్లిలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బొల్లంపల్లి గ్రామానికి చెందిన గద్దగూటి జానయ్య (38) అతని చిన్న కుమారుడు విఘ్నేష్ (11) ఇద్దరు శుక్రవారం సాయంత్రం గ్రామ శివారులోని రోడ్డు వెంట ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రం స్థలానికి వెళ్లారు. అక్కడ అప్పటికే పిల్లలు క్రికెట్ ఆడుకుంటున్నారు. ఆ పిల్లలతో కలిసి విఘ్నేష్ ఆడుకుంటుండగా తండ్రి జానయ్య సమీపంలోని కంకర కుప్పలో కూర్చున్నాడు. ఈ క్రమంలోనే అదే గ్రామానికి చెందిన బొడ్డు శేఖర్ టిప్పర్‌ను తోలుకుంటూ ఆట స్థలం వద్దకు వచ్చాడు. శేఖర్ తాగిన మైకంలో టిప్పర్‌ను ఈ పిల్లలు ఆడుకునే స్థలం వైపు తీసుకొచ్చాడు. ఈ క్రమంలోనే విఘ్నేష్ ఆడుకుంటుండగా టిప్పర్ ఎదురుగా వచ్చింది. తన కుమారుడు టిప్పర్ కింద పడబోగా అక్కడే ఉన్న తండ్రి జానయ్య ఒక్కసారిగా లేచి రక్షించేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో టిప్పర్ చక్రాల కింద పడి ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. మృతుడు జానయ్యకు భార్య సుజాత, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కాగా, టిప్పర్‌ను అతివేగంగా నడపడంతో గ్రౌండ్‌లోని మరికొంతమంది పిల్లలు పరుగులు తీసుకుంటూ ప్రాణాలు కాపాడుకున్నారు. అనంతరం టిప్పర్ డ్రైవర్ పరారయ్యాడు. విఘ్నేష్ సూర్యాపేటలోని గురుకుల పాఠశాలో 5వతరగతి చదువుతున్నాడు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ మహేందర్‌నాథ్, ఏఎస్ఐ రాములు సందర్శించారు. ఇదిలా ఉండగా తమకు న్యాయం జరిగే వరకూ మృతదేహాలను పోస్టుమార్టంకు పంపించమంటూ మృతుడి కుటుంబీకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామంలో విషాదఛాయలు

మహాశివ రాత్రి పండుగ రోజు దుర్ఘటన జరగడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. తండ్రీకుమారులు ఇద్దరు మృతి చెందడంతో కుటుంబీకులు, బంధువులు దుఃఖసాగరంలో మునిగారు. ఘటనకు బాధ్యుడైన శేఖర్‌ను కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

మానవ నిర్మిత అడవి సందర్శన

మోతె : మండలంలోని రాఘవాపురం ఎక్స్‌రోడ్డు గ్రామంలో జలసాధన సమితి వ్యవస్థాపకుడు దుచ్చర్ల సత్యనారాయణ నిర్మించిన (మానవ నిర్మిత అడవి) ఫారెస్టును శుక్రవారం సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ చైర్మన్ డాక్టర్ బొమ్మరబోయిన కేశవులు సందర్శించారు. ఈ సందర్భంగా కేశవులు మాట్లాడుతూ.. ఈ అడవి చుట్టూ తిరిగి అడవిలో పక్షులు, పెద్దపెద్ద వృక్షాలు, వన ఔషధ మూలికలు, పచ్చదనం, ఆహ్లాద వాతావరణం ఆస్వాదించామన్నారు. దుచ్చర్ల సత్యనారాయణ అడవిని నిర్మించడం గొప్పవిషయమన్నారు. ఈ అడవిలో ఎన్నో మూగజీవాలు, పక్షులు, వృక్షాలు, ఔషధ మొక్కలు, పుష్పాలు ఉండడం విశేషమన్నారు. శివరాత్రి పర్వదినం సందర్భంగా మానవ నిర్మిత అడవిలో ఉన్న ఆలయాలను, గ్రామదేవతలను దర్శించుకున్నామన్నారు. కార్యక్రమంలో దుచ్చర్ల సత్యనారాయణ, గౌని సంతోష్, అర్వపల్లి ఉపేందర్, బానోతు వీరన్న, అన్వేష్, గునగంటి నాగరాజు గౌడ్, బోనగిరి సందీప్, సంతోష్, చింతపల్లి వెంకన్న, సైదులు, అజ్మత్, రాజు, పాల్గొన్నారు.

భక్తుల కోరికలు తీర్చే తల్లి.. సాగరమాత

- నల్లగొండ విశ్రాంత పీఠాధిపతులు డాక్టర్ గోవింద్ జోజి


దివ్యబలిపూజలో ప్రసంగిస్తున్న గోవింద్ జోజి

నాగార్జునసాగర్: ఎందరో భక్తులకు దర్శనం ఇస్తూ కోరిన కోరికలు తీర్చే తల్లి సాగరమాత అని నల్లగొండ విశ్రాంత పీఠాధిపతులు డాక్టర్ గోవింద్ జోజి అన్నారు. సాగర్ మాత ఉత్సవాల్లో రెండో రోజైన శుక్రవారం ఆయన సాగరమాత ఆలయంలోని జపమాల క్షేత్రంలో విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ ఆధ్వర్యంలో జరిగిన సమష్టి దివ్యబలిపూజలో పాల్గొని ప్రసంగించారు. క్రైస్తవ భక్తులంతా సమాజానికి ఆదర్శవంతంగా నిలవాలన్నారు. సాటివారిని ఆదరించడం, ప్రేమను పంచిపెట్టడం ప్రధానమన్నారు. సృష్టికర్త సహితం అమ్మ ద్వారానే ఈ లోకానికి వచ్చాడని పేర్కొన్నారు. అమ్మ ప్రేమ, అనురాగాలను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరితో ప్రేమతో మెలగాలన్నారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం 5గంటలకు గురుశ్రీ చిన్నాబత్తిని కిరణ్‌కుమార్‌చే దివ్యబలిపూజ, 6గంటలకు ఏటుకూరు విచారణ గురువులు గురుశ్రీ బొక్కా బాలశౌరిచే దివ్యబలిపూజ, 7గంటలకు గురుశ్రీ తుమ్మా కరుణాకర్‌రెడ్డిచే దివ్యబలిపూజ, 9.30 గంటలకు గురుశ్రీ మరియదాసుచే భక్తుల ఆహ్వానం, జపమాల, స్తుతీ ఆరాధన చేశారు. ఉదయం 11.30గంటలకు దివ్యబలిపూజ, మధ్యాహ్నం ఒంటి గంటకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. 2గంటలకు వాక్యపరిచర్య, స్వస్థతా ప్రార్థనలు, సాయంత్రం 4గంటలకు కోలాటము, 5.30గంటలకు సమష్టి దివ్యబలిపూజ, రాత్రి 7.30గంటలకు కొవ్వొత్తులతో తేరు ప్రదక్షిణ చేశారు. 8గంటలకు వంకాయలపాటి రామదాసు పర్యవేక్షణలో సాగర్‌మాత బృందంచే సాగర్‌మాత–సహాయమాత బుర్రకథ, 9గంటలకు విజయకళా నాట్యమండలిచే ధనవంతుడు–బీదలాజర్ బెబిల్ నాటకం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో జరిగిన కోలాట ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.

మిరప కోతలో మెళకువలు

- మిరప కోత, ఆరబెట్టే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలి
- పెద్దవూర ఏఓ సందీప్‌కుమార్


కె.సందీప్‌కుమార్

పెద్దవూర: మిరప పంటను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విస్తారంగా సాగు చేస్తున్నారు. మిరప పంట ఇప్పుడిప్పుడే పండుగా మారుతుండటంతో రైతులు కాయలను కోసేందుకు సిద్ధమవుతున్నారు. ఎండుమిర్చికి మార్కెట్‌లో క్వింటా రూ.14వేలకు పైగా అమ్ముడు పోతున్నాయి. మిరప కోత, ఆరబెట్టే సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకుంటే రైతులు నష్టాన్ని చవిచూడాల్సి వస్తుందని పెద్దవూర మండల వ్యవసాయ అధికారి కె.సందీప్‌కుమార్ తెలిపారు. మిరప కోత, ఆరబెట్టే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఆయన మాటల్లోనే.. మిరప రైతులు ఎకరానికి 20నుంచి 30క్వింటాళ్ల దిగుబడి సాధిస్తున్నా నాణ్యత లేకపోవడంతో నష్టాలను చవిచూడాల్సి వస్తుంది. సరైన సమయంలో కోతలు కోయక, కల్లాల్లో వర్షానికి, మంచుకు కాయలు తడిస్తే నాణ్యత తగ్గుతుంది. మార్కెట్లో ధరలు లేక ఎగుమతులకు పనికిరాక, వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేయడం వంటి కారణాలతో రైతులు నష్టపోతున్నారు. పంట మార్పిడి చేయకపోవడం, విచక్షణారహితంగా పురుగు మందులను పిచికారీ చేయడం, పండిన మిరప కాయలు ఎప్పటికప్పుడు తెంచకపోవడం వంటి కారణాలతో కాయ నాణ్యత లోపిస్తుంది.


తెల్ల మిరప కాయలు వేరుచేస్తున్న కూలీలు

ఆరబెట్టడం ఇలా..

కొన్నిసార్లు కోతల సమయంలో వర్షాలు కురిస్తే సకాలంలో కోతలు జరగక కోసిన వాటిని సరైన సమయంలో ఎండబెట్టక పోవడంతో నాణ్యత లేని మిర్చిగా మారిపోతుంది. ఫలితంగా మార్కెట్లో కాయలకు సరైన ధర రాక నష్టపోవాల్సి వస్తుంది. మిరప కాయల్ని ఎండబెట్టే కల్లాల్ని గట్టి భూమి ఉండే ప్రదేశంలో ఏర్పాటు చేసుకోవాలి. దుమ్ము ఎక్కువగా లేని, కొద్దిగా ఏటవాలుగా ఉండే ప్రదేశాన్ని ఎంచుకోవాలి. నీళ్ల వెళ్లే వైపు కల్లం పొడవుగా ఉండాలి. వర్షం పడినప్పుడు పైనీళ్లు కల్లం పైకి రాకుండా కల్లం చుట్టూ అడుగున్నర ఎత్తు కట్ట ఏర్పాటు చేసుకోవాలి. తోట విస్తీర్ణం, దిగుబడిని బట్టి కల్లం పొడవు, వెడల్పులను తయారు చేసుకోవాలి. వర్షాలు పడ్డప్పుడు పరదాలు కప్పుతాం కాబట్టి నీరు తీసివేయడానికి అనుకూలంగా ఉంటుంది. దాదాపు 10 క్వింటాళ్ల మిరప 30 అడుగుల వెడల్పు, 60 అడుగుల పొడవు గల కల్లం తయారు చేసుకోవాలి. కల్లం సైజును బట్టి టార్పాలిన్ కవరు తెచ్చుకోవాలి. ప్రతిరోజు కోసే కాయల్ని కుప్పలుగా పోసి మరుసటి రోజు ఉదయం మంచు తగ్గగానే పలుచగా పోసి ఆరబెట్టాలి. ప్రతిరోజు సాయంత్రం ఆరబెట్టిన మిరప కాయల్ని కుప్పగా పోసి టార్పాలిన్ కవర్ కప్పి కాయలపై మంచు పడకుండా జాగ్రత్త తీసుకోవాలి. ఇలా చేస్తే గాలి, వెలుగురు బాగా ప్రసరించి కాయలు త్వరగా ఎండుతాయి. కాయలు బాగా ఎండకముందే తెల్లకాయలు వేరుచేయాలి. కాయల్లో 5శాతం తేమ ఉన్నప్పుడే వాటిని మండె పోసి గోనె సంచులతో కప్పాలి. మార్కెట్‌కు తీసుకెళ్లే రోజు ఉదయం శుభ్రమైన ఖాళీ సంచుల్లో వాటిని నింపాలి. ఒక్కో సంచిలో 40కిలోల కాయలకన్నా ఎక్కువ నింపకూడదు. ఎక్కువ కాయల్ని సంచిలో తొక్కితే కాయ నాణ్యత చెడిపోయి మార్కెట్‌లో సరైన ధర రాదు. కోత సమయంలో ఈ విధమైన చర్యలు చేపడితే నాణ్యమైన పంటతో పాటు మార్కెట్లో అధిక ధర పలుకుతుంది.

పాడి పంట

కోత విధానం

మిరపతోటలో కొన్ని కాయలు పండిన వెంటనే కూలీలతో కోస్తే, చెట్టు విరిగిపోయి తోటకు నష్టం కలుగుతుందని రైతులు భావిస్తున్నారు. చాలా కాయలు పండిన తరువాత ఒకే సారి కోయవచ్చునని మరికొంత మంది రైతులు భావించి కోతను ఆలస్యం చేస్తుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆకాల వర్షాలు కురిస్తే పండిన కాయలు రాలిపోతాయి. మంచు వల్ల కూడా కాయలు రాలిపోయే అవకాశం ఉంది. ఒక్కోసారి తెల్లకాయలు ఎక్కువగా వస్తుంటాయి. మొక్కల ఎదుగుదల తగ్గుతుంది. అందువల్ల రైతులు తోటలో కోతకు వచ్చిన కాయల్ని విడతల వారీగా కోసి నాణ్యత గల కాయల్ని మార్కెట్‌కు పంపాలి. పండిన కాయల్ని వెంటనే కోస్తే తెల్లకాయలు ఎక్కువగా రావు. కాయకోత తరువాత ఎరువులు వేసి, నీటి తడి పెడితే అదనంగా మొక్కకు కాయ వచ్చి దిగుబడి పెరుగుతుంది. రైతులు కనీసం కాయలను ఆరు, ఏడు దఫాలుగా కోయాలి.